క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ తల్లి ఊరేగింపు


అమ్మవారిని పల్లకీ సేవకు తీసుకెళ్లుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరులు

పాత గుంటూరు: లక్ష్మీతిరుపతమ్మ తల్లి చల్లని దీవెనలు అందించాలని శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. శ్రీనివాసరావుపేటలోని లక్ష్మీతిరుపతమ్మ తల్లి 28వ వార్షిక మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, స్థానిక కార్పొరేటర్ గేదెల నాగ రంగమణి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. దీపకాంతుల నడుమ, కనకతప్పెట్లతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. విశేష సంఖ్యలో పాల్గొన్న మహిళల మంగళహారతులతో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పల్లకీ మోసి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఆళ్ల శ్రీను, ఆళ్ల హరి, నాగమ్మ శ్రీను, అబ్బిశెట్టి రంగా, రామకృష్ణ, పగడాల రామకృష్ణ, జె.రామారావు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం


5కే వాక్‌ను ప్రారంభిస్తున్న షేక్ సజిల

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కొత్తపేటలోని ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించేందుకు 5కే వాక్ నిర్వహించారు. నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల జెండా ఊపి వాక్‌ను ప్రారంభించారు. మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన పెంచడానికి 5కే వాక్ నిర్వహణ అభినందనీయమన్నారు. ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలని సజిల సూచించారు. కార్యక్రమంలో ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ వి.రమ్య, పలువురు యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యేలూరి హాస్పిటల్స్ అధినేత, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ యేలూరి రామకృష్ణ తెలిపారు. స్థానిక కొత్తపేట బోసుబొమ్మ సెంటర్‌లోని తమ హాస్పిటల్‌లో ఉదయం 10 నుంచి ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. కిడ్నీ వైద్య నిపుణులు రోగుల్ని ఉచితంగా పరీక్షించి వైద్య సలహాలు అందిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

కుటుంబ వ్యవస్థను కాపాడేది మహిళలే..


వేడుకల్లో పాల్గొన్న మురళీకృష్ణ


కొరిటిపాడు(గుంటూరు): భారత సమాజం రక్షించబడుతుందంటే కారణం కుటుంబ వ్యవస్థ అని, దానికి ఆలంబనగా వ్యవహరించేది మహిళలే అని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలకు నూతన వస్త్రాలను బహూకరించారు.ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఎందరో మహిళలు దేశ నాయకులుగా చరిత్ర సృష్టిస్తూ, జాతి దశను, దిశను మార్చేస్తున్నారని వెల్లడించారు. బజరంగ్ ఫౌండేషన్ మహిళా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నారీ రుతువు కార్యక్రమం అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం సంస్థ కార్యాలయం, ఫౌండేషన్‌లలో పనిచేస్తున్న ఉద్యోగినులు, కార్మికుల్ని సత్కరించారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్లు సిద్దినేని శ్రీనివాసరావు, ఎస్.సమీర్‌నందన్, జి.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

12న ముత్తాయపాలెంలో కళ్లజోళ్ల పంపిణీ

'జగన్నామ సంక్షేమ సంవత్సరం' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6న బాపట్ల నియోజకవర్గంలోని ముత్తాయపాలెంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య పరీక్ష శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన వారికి యుద్ధప్రాతిపదిన వాటిని సిద్ధం చేయిస్తున్నామని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు రోజుల వ్యవధిలోనే 507 మంది నిరుపేదలు, మత్స్యకారులకు కళ్లజోళ్ల పంపిణీని ఈనెల 12న (ఆదివారం) సాయంత్రం 3.30 గంటలకు ముత్తాయపాలెంలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కళ్లజోళ్లకు ఎంపికైన వారందరూ ఆ రోజు గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి బొమ్మ వద్దకు వచ్చి తీసుకోవాలని ఆయన సూచించారు.

ఆధునిక జీవనశైలితో ముంచుకొస్తున్న ముప్పు

- నేడు వరల్డ్ కిడ్నీ డే
- పెరుగుతున్న కిడ్నీ జబ్బుల కేసులు
- ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం
- రోగులకు అందుబాటులో ఆధునిక వైద్యసేవలు



గుంటూరు మెడికల్: శరీరంలో కిడ్నీలు కీలకపాత్ర పోషిస్తాయి. చిక్కుడు గింజ ఆకారంలో ఉండే ఇవి నిరంతరం రక్తాన్ని పరిశుభ్రం చేస్తుంటాయి. ఒక్క రోజులోనే సుమారు 200 లీటర్లను వడకట్టి రక్తపోటు నియంత్రణతో పాటు ఒంట్లో నీరు, లవణాల సమతుల్యత దెబ్బతినకుండా కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. నేటి మనిషి ఆధునిక జీవనశైలిలో కిడ్నీ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించేందుకు 2006 నుంచి ప్రతి ఏడాది మార్చి రెండో గురువారం వరల్డ్ కిడ్నీ డేని నిర్వహిస్తున్నారు. ఈనెల 9న వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

బాధితులు అధికమే...

ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కిడ్నీ ఫౌండేషన్ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మందిలో ఒకరు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. మన దేశంలో 10లక్షల మందిలో 800 మంది కేవలం షుగర్ వల్ల కిడ్నీ జబ్బులకు గురువుతున్నారు. జిల్లాలో 20 మంది వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్ద ప్రతిరోజూ 30 నుంచి 40 మంది కిడ్నీ సమస్యలతో చికిత్స పొందుతున్నారు. చిన్న పిల్లల్లో సైతం జబ్బులు రావడంపై నెఫ్రాలజిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కిడ్నీ వ్యాధి లక్షణాలు

- వ్యాధి సోకినవారిలో ముఖం, కాళ్లవాపులు కనిపిస్తాయి
- ఆయాసం, అలసటగా ఉంటుంది.
- పనిమీద ఏకాగ్రత తగ్గడంతో పాటు ఆకలి మందగిస్తుంది.
- రాత్రివేళల్లో మూత్రం ఎక్కువసార్లు రావటం, కొన్ని సందర్భాల్లో సరిగా రాకపోవడంతో పాటు రక్తం కారుతుంది.
- మూత్రం పోసేటప్పుడు దీర్ఘకాలంగా చురుకు, మంట

హైరిస్క్ వారు జాగ్రత్తగా ఉండాలి

బీపీ, షుగర్ ఉన్నవాళ్లు హైరిస్క్ గ్రూప్‌కు చెందిన వారు. వీరి కిడ్నీ జబ్బుల బారిన పడే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. షుగర్ సోకిన ఏడు నుంచి పదేళ్లలో కిడ్నీలు పాడయ్యే అవకాశం ఎక్కువ. అధిక బరువు ఉన్నవారు సైతం జబ్బున పడే ప్రమాదం ఉంది. జీనవశైలిలో వచ్చిన మార్పుల వల్ల నేడు 20 ఏళ్లు దాటిన ప్రతి 10 మందిలో ఒకరు బారిన పడుతున్నారు. షుగర్, అధికరక్తపోటు, ఊబకాయం దీనికి కారణం. బీపీ, షుగర్ ఉన్నవాళ్లు తప్పనిసరిగా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి. వయస్సు మీద పడేకొద్ది సహజంగా మూత్ర సంబంధిత సమస్యలు వస్తాయి. వాటిని సకాలంలో గుర్తించకపోతే కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంది.

వ్యాధి బారిన పడకుండా జాగ్రత అవసరం



క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. రక్తంలో చక్కెర శాతాన్ని , అధిక రక్తపోటులను నియంత్రణలో ఉంచుకోవాలి. ఆరోగ్య కరమైన ఆహార నియమాలు పాటించాలి. అధిక బరువును తగ్గించుకోవాలి. డాక్టర్ పర్యవేక్షణ లేకుండా ఇష్టం వచ్చినరీతిలో మందులు వాడకూడదు. పొగ, మద్యం తాగడంలాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. పరిమితమైన ఆహారం, ఉప్పు తగ్గించి వాడటంతో పాటు ఎక్కువగా నీటిని తాగాలి.

– డాక్టర్ అన్నపురెడ్డి శివనాగేంద్రరెడ్డి, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

అందుబాటులో ఆధునిక వైద్యం



బ్లడ్ గ్రూప్ మ్యాచ్ కాకపోయినా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేసే ఆధునిక వైద్యసేవలు నేడు అందుబాటులో ఉన్నాయి. మిస్ మ్యాచ్ కిడ్నీ బాధితులు పలువురికి విజయవంతంగా ఆపరేషన్లు చేశాం. జీవనధాన్ పథకం ద్వారా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నాము. డయాలసిస్ చేయించుకునేవారికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేస్తే ఎంతో ఉపయోగంగా ఉండి, జీవితకాలం 20 ఏళ్ల వరకు పొడిగించవచ్చు.

–డాక్టర్ చింతారామకృష్ణ, కిడ్నీ మార్పిడి వైద్య నిపుణులు, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచిత వైద్యసేవలు



గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చేవారి సంఖ్య 100 నుంచి 150 వరకు ఉంటుంది. వీరే కాకుండా ప్రతి రోజూ 40 మందికి పైగా రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. పాజిటివ్ కేసులకు కూడా డయాలసిస్ చేసే సౌకర్యం ఉంది. ఆస్పత్రిలో 24 గంటలూ డయాలసిస్ వైద్యసేవలు జరుగుతూనే ఉంటాయి.

– డాక్టర్ మొహమ్మద్ అస్లాం, నెఫ్రాలజిస్ట్, జీజీహెచ్ గుంటూరు

సంజీవయ్యనగర్ రైల్వే గేట్ ఓపెన్

- బుధవారం ఉదయం నుంచి యథావిధిగా రాకపోకలు



నెహ్రూనగర్: స్థానిక వాటర్ ట్యాంకుల నుంచి హెచ్ఎల్ఆర్(లక్ష్మీపురం) వాటర్ ట్యాంకులకు ఇంటర్ కనెక్షన్ పనుల నిమిత్తం ఫిబ్రవరి 21 నుంచి మూసివేసిన సంజీవయ్యనగర్ రైల్వే గేటును మంగళవారం వరకు తీయలేదు. దీంతో గత 15 రోజుల నుంచి సంజీవయ్యనగర్, రాజీవ్‌గాంధీనగర్, రెడ్డిపాలెం నుంచి నెహ్రూనగర్ మీదుగా కొత్తపేటకు రాకపోకలు సాగించే వాహనదారులు డొంకరోడ్డు మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంటర్ కనెక్షన్ పనులు పూర్తయినప్పటికీ చిన్న చిన్న పనుల కోసం ఇంజినీరింగ్ అధికారులు గుంతలు పూడ్చి వేయకుండా, గేటు ఓపెన్ చేయనియకుండా అలాగే వదిలేశారు. దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని 'సాక్షి' కమిషనర్ దృష్టికి ఫోన్ ద్వారా తెలియజేసింది. స్పందించిన కమిషనర్ యుద్ధప్రాతిపదికన రైల్వే గేటు వద్ద గుంతల్ని పూడ్చి వేయాలని ఆదేశాలివ్వడంతో ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం రాత్రి నుంచి పనులు ప్రారంభించారు. బుధవారం తెల్లవారుజామునకు రోడ్డును పునరుద్ధరించారు. దీంతో ఉదయం నుంచి రైల్వే గేటు ఓపెన్ ఆవ్వడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళాభ్యున్నతికి సీఎం జగన్ కృషి : మేయర్


జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాను సన్మానిస్తున్న మేయర్ కావటి, కార్పొరేటర్లు


యువీకా అవార్డును డాక్టర్ షమ సుల్తానాకు అందజేస్తున్న నూరిఫాతిమా తదితరులు


రమేష్ హాస్పిటల్‌లో విజేతలను సన్మానిస్తున్న డాక్టర్ మమత తదితరులు

నెహ్రూనగర్: మహిళాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. నగర పాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినాను, నగర పాలక సంస్థ మహిళా కార్పొరేటర్లను మేయర్ అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నేడు కుటుంబ బాధ్యత పురుషుల కంటే మహిళలే ఎక్కువగా తీసుకుంటున్నారన్నారు. మహిళల సంక్షేమానికి గానూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు, మహిళలకు రక్షణగా దిశ చట్టం, దిశ పోలీస్ స్టేషన్లు, ప్రతి సచివాలయంలో మహిళా పోలీసు వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. కుటుంబంలో ఒక మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబం యావత్తూ సమగ్ర అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలుగా కొలువై ఉంటారని తెలిపారు. సీఎం వై.ఎస్. జగన్ మహిళా సాధికారత తీసుకువచ్చి పురుషులతో సమానంగా ఎదగడానికి రాజకీయ పదవుల్లో, సంక్షేమ పథకాల అమలులో మహిలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ మహిళా పక్షపాతిగా నిలిచారని చెప్పారు.కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజీల, వివిధ డివిజన్ల మహిళా కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గుంటూరు మెడికల్: మహిళలు ఎక్కువగా వ్యాధుల బారిన పడుతుంటారని, ఇంటి పనులు, ఉద్యోగ బిజీలో పడి ఆరోగ్యంపై దృష్టి సారించకపోవడం వల్ల అనేక అనర్థాలు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ నాయకురాలు షేక్ నూరిఫాతిమా తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం స్థానిక గుంటూరువారితోట 7వ లైనులో హోప్‌విన్ హాస్పిటల్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. మహిళల ఆరోగ్యం కోసం యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ షమ సుల్తానా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ షమ సుల్తానాకు యువీకా –2023 అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా యువీకా అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశామన్నారు. మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తెలియజేసి వారి ఆర్థికాభివృద్ధికి పాటుపడటమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, క్రిటికల్ కేర్ స్పెషలిస్టు డాక్టర్ బషీరుద్దీన్, హాస్పిటల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రమేష్ హాస్పిటల్‌లో వేడుకలు

గుంటూరు మెడికల్: మార్కెట్ సెంటర్‌లోని రమేష్ ఆసుపత్రిలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన, సౌత్‌లెవల్ రైఫిల్ షూటింగ్ బ్రాంజ్ మెడల్ సాధించిన దీక్షిత, లీగల్ అడ్వైజర్ అనూరాధ, విజ్ఞాన్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, గైనకాలజిస్ట్ డాక్టర్ వసుంధరాదేవీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ దూసుకెళుతున్నారని చెప్పారు. మహిళలు ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల చికిత్సలో భాగంగా ప్రత్యేక ప్యాకేజీతో వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అనిత, డాక్టర్ సుప్రజ, డాక్టర్ స్వప్న పాల్గొన్నారు.

పలువురు మహిళలకు సన్మానం

నెహ్రూనగర్: ఆదివాసి దళిత బహుజన ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బుధవారం కాకుమానువాడి తోటలోని యానాది కాలనీ ట్యూషన్ సెంటర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు, మహిళా హక్కుల కోసం పోరాట నాయకుల్ని ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ రిటైర్డ్ డీఐజీ బాలస్వామి మాట్లాడుతూ ఆడపిల్లల్ని చదివించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జూపూడి శ్రీనివాసరావు, భగత్‌సింగ్, గంట ప్రభుదాస్, నాయకులు పాల్గొన్నారు.


ఆదివాసి దళిత బహుజన ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం

షుగర్ వ్యాధితో మహిళల్లోనూ సమస్యలు అధికం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాంకుమార్

గుంటూరు మెడికల్: షుగర్ వ్యాధి అదుపులో లేకపోతే పురుషుల కంటే మహిళల్లో సమస్యలు ఎక్కువగా ఉంటాయని డాక్టర్ వి.వి.రాంకుమార్ సూచించారు. మహిళ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం స్థానిక కొత్తపేట భగత్‌సింగ్ బొమ్మ సెంటర్‌లోని ఎస్‌వీఆర్ డయాబెటిస్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు మహిళలకు ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ రాంకుమార్ అవగాహన కల్పించారు. గర్భిణుల్లో షుగర్ అదుపులో లేకపోతే అనేక సమస్యలు వస్తాయని తెలిపారు. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆమెతోపాటు, పుట్టబోయే బిడ్డకు షుగర్ రాకుండా కాపాడవచ్చని చెప్పారు. వైద్యుల పర్యవేక్షణలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం చేయడం ద్వారా షుగర్ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు.

కులం దూషణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తిని కులం పేరుతో దూషించిన తండ్రి, కుమార్తెపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో వస్త్రాల షాపు నిర్వహించే రాజేష్‌కు మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన ఎం.చినరాములు రూ. 6 లక్షలు అప్పుగా ఇచ్చాడు. రాజేష్ డబ్బులు చెల్లించకుండా, సమాధానం చెప్పకుండా తిరుగుతున్నాడు. షాపు వద్ద, ఇంటి వద్ద ఉండటం లేదు. పట్టాభిపురంలోని రాజేష్ ఇంటికి చినరాములు పలుమార్లు వెళ్లగా అతడి తండ్రి, సోదరి కులం పేరుతో దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఆగంతకుడు మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకుని పారిపోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజేంద్రనగర్ 5వ లైనుకు చెందిన మండవ శివపార్వతి స్తంభాలగరువు నీళ్ల ట్యాంకు సమీపంలో బుధవారం రాత్రి నడుచుకుంటూ వెళుతోంది. ఈ సమయంలో ఓ ఆగంతకుడు నడుచుకుంటూ వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా పుష్పయాగం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో లక్ష్మీ జయంతి సందర్భంగా బుధవారం శ్రీపద్మావతి అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి మాధవస్వామి ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పలు రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా పుష్పాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిశ్చల్ నరసింహం, సిమ్రాన్‌కౌర్ దంపతుల సౌజన్యంతో నిర్వహించారు.

జిల్లాస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడల్ని ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రెండు శాతం రిజర్వేషన్లు కల్పించారని తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకురాలు షేక్ నూరి ఫాతిమా తెలిపారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీఆర్ స్టేడియంలో 9వ జిల్లాస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీల్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల వల్ల మహిళల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని తెలిపారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి అశోక్‌బాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుమారు 50 మంది పాల్గొన్నారన్నారు. విజేతలు ఈ నెల 10, 11 తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ డి.ఎస్. క్రిస్టోఫర్, అధ్యక్షుడు ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రాలు, సామగ్రి పంపిణీ


వృద్ధులకు మిక్సీలు పంపిణీ చేస్తున్న భాస్కర్

పాత గుంటూరు: కొత్తపేటలోని మహిళా మండలి వృద్ధాశ్రమంలో క్రాస్ మినిస్ట్రీస్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పాస్టర్ జేమ్స్ భాస్కర్ ఆధ్వర్యంలో వృద్ధులకు నూతన వస్త్రాలు, పలు వస్తువులు పంపిణీ చేశారు. మహిమ మహిళ స్వయం సహాయక సంఘం సేవకురాలు ప్రేమకుమారి ఆధ్వర్యంలో ఆశ్రమం నిర్వాహకులు సరోజమ్మ, నాగమ్మ, రాణి, వృద్ధురాలు అన్నపూర్ణమ్మను వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో బాబూరావు, డేవిడ్ రాజేంద్రప్రసాద్, శిల్పకుమారి, నాగమణి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: ఆర్. అగ్రహారం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ఉదయం అర్చకులు ప్రాతఃకాల ఆరాధన, మూలవిరాట్‌కు విశేషంగా పంచామృతాలతో అభిషేకం, నిత్యార్చన, హోమం, బలిహరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గోదాలక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో హైకోర్టు జ్యుడీషియల్ ప్రివ్యూ చైర్మన్ జస్టిస్ బి. శివశంకర్‌రావు, జయలక్ష్మి దంపతులతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఛాయంత్రం మంగళవాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, దేవతామూర్తుల వేషధారణలతో స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, కార్యదర్శులు దాసరి భాస్కరరావు, పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, సభ్యులు పర్యవేక్షించారు.

అంగరంగ వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: నందివెలుగు రోడ్డు వస్తనగర్‌లోని శ్రీ పద్మావతీ గోదాదేవి సమేత కామ్యసిద్ధి వేంకటాచలస్వామి దేవస్థానం అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సుప్రభాత సేవ, అర్చన, విష్వక్సేనపూజ, పుణ్యాహవాచన, నిత్య హోమం, బలిహరణ, కుంభ పూజ, అభిమంత్రణ, తదితర పూజల్ని భక్తిశ్రద్ధలతో చేశారు. అనంతరం అగ్నిహోత్రం రంగాచార్యులు నిర్వహణలో పద్మావతి, గోదాదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అశేష భక్తజన సందోహంలో శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఉడా మాజీ చైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, మండవ శేషగిరిరావు, మద్దినేని నాగేశ్వరరావు, కొత్తమాసు వేణుగోపాల్, కూరపాటి నరసింహారావు, చామర్తి రాధాకృష్ణమూర్తి, కొండా శ్రీనివాస రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్‌పై ఫిర్యాదులను తక్షణం పరిష్కరించండి

సిబ్బందికి మేయర్ కావటి సూచన


ఎలక్ట్రిసిటీ స్టాక్ పాయింట్‌లో వస్తువులను పరిశీలిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: విద్యుత్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. నాజ్ సెంటర్ లోని ఎల్ఎల్ఆర్ రిజర్వాయర్ వద్ద నగర పాలక సంస్థ ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించిన స్టాక్ పాయింట్ (వీధి దీపాల విడిభాగాలు)ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు, ప్రజావసరాల దృష్ట్యా అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాల్ని ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజల వద్ద నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వాటిని సత్వరం పరిష్కరించడానికి గానూ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఏఈలను నియమించినట్లు చెప్పారు.

10న దర్పణం పుస్తకావిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న తాండవకృష్ణ

పాత గుంటూరు: శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 10న గుంటూరు కళాపరిషత్ రజతోత్సవ ప్రత్యేక సంచిక దర్పణం పుస్తకావిష్కరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లూరు తాండవకృష్ణ, బి. పూర్ణ, తెలిపారు. విజ్ఞాన మందిరంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో పుస్తకావిష్కరణ అనంతరం పాకుడురాళ్లు నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కళాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షులు పి.వి. మల్లికార్జునరావు, నాయుడు గోపి పాల్గొన్నారు.